# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- తల్లికి వందనం పథకాన్ని రేపటి నుంచి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.
- రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు.
- పొగాకు రైతులకు మేలు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.
- దేశంలో మౌలిక సదుపాయాలు కల్పనకు ఎన్డీయే ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని అధికార వర్గాలు వెల్లడించాయి.
- బంగాళాఖాతలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

=====================

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి అవుతున్న సందర్భంగా రేపు తల్లికి వందనం పథకం అమలు చేయాలని నిర్ణయించింది. ఈ పథకం కింద తల్లుల ఖాతాలలో నగదు విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 8 వేల 745 కోట్ల రూపాయలను కేటాయించిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రతీ ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం పథకం అమలు చేయనున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 67 లక్షల 27 వేల 164 మంది విద్యార్థులకు పథకం వర్తించనుంది. 1వ తరగతిలో ప్రవేశం పొందిన పిల్లల నుంచి ఇంటర్ మొదటి ఏడాది చేరే విద్యార్థుల వరకూ ఈ పథకం అమలు చేస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

=====================

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. తిరుపతిలో ఈ రోజు ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ కి కేంద్ర

ప్రభుత్వం 8 కేంద్రీయ విద్యాలయాలను మంజూరు చేసిందని తెలిపారు. అలాగే, రైల్వే బడ్జెట్‌లో రాష్ట్రానికి పెద్దపీట వేసి పలు రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తోందని వివరించారు. పలు విమాశ్రయాలను ఆధునీకరించే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం చేపట్టిందని వెల్లడించారు. రాష్ట్రానికి 24 లక్షల ఇళ్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని బండి సంజయ్ తెలియచేస్తూ...

(వాయిస్ 40 సెకన్లు)

=====================

యువతలో వ్యాపార నైపుణ్యం, స్టార్టప్ ఎకో సిస్టమ్ అభివృద్ధికి ప్రముఖ సాఫ్ట్ వేర్ సంస్థ సైయెంట్ (Cyient) అఖిల భారత సాంకేతిక విద్యా మండలి, ఏఐసీటీఈతో రాష్ట్ర ప్రభుత్వం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు గుంటూరు జిల్లా ఉండవల్లిలోని తన నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో సైయెంట్ ఫౌండేషన్, ఏఐసీటీఈ ప్రతినిధులతో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి విభాగం అధికారులు త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా ప్రధానంగా నగర ఆధారిత ఇన్నో వేషన్ క్లస్టర్లను ప్రారంభించేందుకు సైయెంట్ ఫౌండేషన్, ఏఐసీటీఈ సహకారం అందించనున్నాయి. మొదటగా విశాఖపట్నం నుంచి ఈ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి.

=====================

పొగాకు రైతులకు మేలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మరో మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామితో కలసి ఒంగోలులో ఈ రోజు జరిగిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా జరుగుతున్న పొగాకు వేలం తీరును పరిశీలించారు. కొనుగోళ్ల తీరుతెన్నులతో పాటు.. రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. తక్కువ రకం పొగాకు కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అవసరమైతే బోర్డు జోక్యం చేసుకోవాలని అన్నారు. బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలుకు మార్క్ ఫెడ్ ను అందుబాటులోకి తెస్తున్నామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

విరామం

=====================

దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం పదకొండేళ్ళ పాలన పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా వివిధ రంగాలలో కేంద్రప్రభుత్వం సాధించిన గణనీయమైన అభివృద్ధితో దేశం ప్రగతి మార్గాన పయనిస్తోంది. దేశంలో మౌలిక సదుపాయాల కల్పన విషయంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణను రూపొందించింది. గత దశాబ్ద కాలంలో భారతదేశంలోని అన్ని ప్రాంతాలను కలుపుతూ.. సమగ్రమైన అనుసంధాన విధానం అమలు జరిగిందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రతీ రోజు దేశంలో సగటున రహదారుల నిర్మాణం రికార్డు స్థాయిలో 34 కిలోమీటర్లకి చేరుకుంది. ఈ విధంగా గత 10 సంవత్సరాల్లో 20 వేల కిలోమీటర్ల రహదారుల నిర్మాణం జరిగింది. అదే విధంగా ఆర్థిక కారిడార్లను అభివృద్ధి చేయడంతో పాటు.. మౌలిక సదుపాయాల అభివృద్ధితో దేశం ముందుకు సాగుతోంది.

=====================

ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం చివరి వ్యక్తి దాకా చేరాలని రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు. పల్నాడు జిల్లాలో ఈ రోజు పర్యటించిన మంత్రి స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలోని గిరిజనుల జీవన విధానాలు, సమస్యలు, అవసరాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా గిరిజన జనాభా స్థితిగతులు, వారికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై సమగ్ర సమాచారాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

=====================

అంతర్జాతీయంగా భారతదేశం కీర్తి పెరగడానికి ఎన్డీఏ సుపరిపాలన కారణమని భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా నాయకులు, రాజ్యసభ సభ్యులు కె.లక్ష్మణ్ అన్నారు. విశాఖపట్నంలో ఈ రోజు పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ.... అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అవతరించిందని గుర్తు చేశారు. అభివృద్ధి విధానంతో పాలన సాగుతోందని చెప్పారు. ఉగ్రవాదుల దాడికి ఆపరేషన్ సిందూర్ తో తగిన జవాబు చెప్పిన ఘనత కేంద్ర ప్రభుత్వానిదే అని అన్నారు. విశాఖలో సౌత్ కోస్ట్ రైల్వే జోన్ తో పాటు భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం వంటివి అభివృద్ధికి నిదర్శనాలుగా ఆయన చెప్పారు.

=====================

వైద్య విద్య పూర్తి చేసిన విద్యార్థులు నిరుపేద రోగులకు సేవ చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ బి.ఆర్.నాయుడు కోరారు. దేశంలోనే స్విమ్స్ ఆసుపత్రికి ప్రత్యేక గుర్తింపు ఉందని ఆయన అన్నారు. తిరుపతిలోని స్విమ్స్ యూనివర్సిటీ 13వ స్నాతకోత్సవం ఈరోజు ఘనంగా జరిగింది. కులపతి హోదాలో టీటీడీ ఛైర్మన్ బి.ఆర్.నాయుడు హాజరై విద్యార్థులకు పట్టాలను ప్రధానం చేశారు. వివిధ కోర్సుల్లో డిగ్రీ పూర్తి చేసిన 510 మంది విద్యార్థులకు పట్టాలు, బంగారు పతకాలను అందజేశారు.

=====================

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ వివరాలను వాతావరణ అధికారి తెలియచేస్తూ..

(వాయిస్ 28 సెకన్లు)

=====================

విశాఖ జిల్లాలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వారి ఆలయానికి చెందిన కృష్ణాపురంలోని గోశాలలో ఈ రోజు జ్యేష్ఠ పూర్ణిమ సందర్భంగా ఏరువాక ఉత్సవాన్ని ఆలయ కార్యనిర్వహణ అధికారి వి.త్రినాధరావు ప్రారంభించారు.

=====================
=====================